www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 10 ఏప్రిల్ 2025

5

కాకినాడ



కోనేరులో పిల్లల జల క్రీడలు


కోనేరులో స్నానాలు చేస్తున్న పిల్లలు

సామర్లకోట: వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం పిల్లల జలక్రీడల ప్రమాదానికి దారి తీసే పరిస్థితులు కన్పిస్తున్నాయి. పాఠశాలలకు ఒంటిపూట బడులు కావడంతో విద్యార్థులు స్థానిక భీమేశ్వర స్వామి ఆలయం పుష్కరిణి ఈత కొడుతూ ఆడుతున్నారు. రక్షణ వలయం దాటి మరీ లోపలికి వెళ్లడమే కాకుండా కోనేరు మధ్యలో ఉన్న రాతి కట్టడం పైకి ఎక్కి యువకులు పైనుంచి కోనేరులో దూకుతున్నారు. ఆలయ అధికారులు దీనిపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. గతంలో ఇదే కోనేరులో పలువురు యువకులు ఊబిలో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. కోనేరులో స్నానాలను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆశాజనకంగా అరటి ధర

- టన్ను రూ.30 వేలకు కొనుగోలు
- ఎగువ రాష్ట్రాల్లో పెరిగిన డిమాండ్
- ఉమ్మడి జిల్లా నుంచి రోజూ 200 లారీల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అరటి ధర ఆశాజనకంగా ఉంది. పెళ్లిళ్ల సీజన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలు రావడంతో పాటుగా ఎగువ రాష్ట్రాల్లో దిగుబడులు లేకపోవడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఉభయ గోదావరి జిల్లాల్లో అరటి తోటలకు ఒక్కసారిగా ధరలు పెరిగాయి. టన్ను రూ.18వేల నుంచి గరిష్టంగా రూ.30వేలకు చేరింది. స్థానిక మార్కెట్లలో అరటి గెల రూ.250 నుంచి రూ.450కి చేరింది. కొన్నిసార్లు గరిష్టంగా రూ.500 చొప్పున కొనుగోలు జరుగుతోంది. గత సీజన్‌లో టన్ను రూ.18వేల వేల నుంచి గరిష్టంగా రూ.24,000కు హోల్‌సేల్‌లో వ్యాపారులు కొనుగోలు చేశారు. మూడేళ్లలో అదే అత్యధికమని రైతులు సంతోషించారు. దేశంలో అత్యధికంగా అరటి సాగు జరిగే మహారాష్ట్రతో పాటు బీహార్, ఒడిశా, హైదరాబాద్, నిజామాబాద్, ముంబయి, రాయపూర్ తదితర ప్రాంతాలలో అరటి దిగుబడులు లేకపోవడంతో రాష్ట్రంలోని అరటికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

తూర్పు, కోనసీమ జిల్లాల్లో విస్తారంగా సాగు

కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీపేట మండలాల్లో విస్తారంగా అరటి సాగు జరుగుతోంది. తూర్పు గోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాల్లో అరటి సాగు అధికంగా జరుగుతోంది. వీటితో ఈ రెండు జిల్లాల్లో మరో 8 మండలాల్లో అక్కడక్కడా అరటి సాగు జరుగుతోంది. అధికారుల గణాంకాల ప్రకారం రెండు జిల్లాల్లో సుమారు 45,000 ఎకరాల్లో అరటి తోటలు సాగవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులు 25 వేల మంది, వ్యాపారులు మరో 3 వేల మంది అరటిపంటపై ఆధారపడి జీవిస్తున్నారు. రావులపాలెం మార్కెట్ నుంచి ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కలకత్తా తదితర రాష్ట్రాలకు ప్రతి రోజూ 100 లారీల్లో ఎగుమతి చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో సుమారు 150కి పైలా లారీలు, ఇతర వాహనాలతో అరటి ఎగుమతి చేసేవారు. రావులపాలెం, ఆత్రేయపురం అరటికి మంచి డిమాండ్ ఉంటోంది. సైజు, లావు, నాణ్యతతో పాటు రుచి, సువాసన కలిగి ఉంటాయి. ప్రధానంగా పచ్చ, కూర కర్పూరం, తెల్లచక్రకేళి, బుసావళి, ఎర్ర చక్రకేళి, తదితర రకాల అరటిని రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు సాగు ఖర్చు రూ.50 వేల నుంచి రూ.70 వేలు ఉంటుంది.


రావులపాలెంలో కళకళలాడుతున్న అరటి మార్కెట్

రోజూ 200 లారీల్లో ఎగుమతి

జిల్లాలోని మార్కెట్ల నుంచి రోజూ 200 లారీలు మాత్రమే ఎగుమతి జరుగుతున్నాయి. సాధారణంగా 100 నుంచి 150 లారీలలో ఎగుమతులు జరుగుతుంటాయి. జిల్లాలోని 45 వేల ఎకరాలకు గానూ సుమారు 8 లక్షల టన్నుల అరటి దిగుబడి వస్తుందని అంచనాగా తెలుస్తోంది. కొన్నేళ్లుగా అరటిసాగుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడం లేదు. ఆకుపచ్చ తెగులు, అనంతరం వరదల ప్రభావంతో అరటి రైతు డీలాపడ్డారు. కొన్నేళ్లుగా అరటిసాగుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడం లేదు. నిల్వ చేసుకునే సౌకర్యాలు లేక అన్‌సీజన్‌లో తక్కువ ధరలకు విక్రయించక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. తాజాగా సీజన్‌లో భారీ డిమాండ్ నెలకొనడంతో ధరలు ఆకాశాన్ని చేరాయి. ప్రస్తుత ధరలు అరటి మార్కెట్లో మరో నెలపాటు ఉండే అవకాశం వుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రతి కూల పరిస్థితుల్లోనూ రైతులను ఆదుకునేందుకు నిల్వ చేసుకునే సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్థానిక మార్కెట్లలోనూ విడి గెలకు డిమాండ్

రావులపాలెం, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం మార్కెట్లలోనూ విడి గెలలకు డిమాండ్ పెరిగింది. ఒక అరటి గెల రూ.400 నుంచి రూ.500 చొప్పున కొనుగోలు జరుగుతున్నాయి. వ్యాపారికి కమిషన్ చెల్లించగా రైతులకు ఆశాజనకమైన ధరల లభిస్తుంది. ఏడాదిలో ఒక నెల మాత్రమే డిమాండ్ ఉంటుంది. ఇతర సమయాల్లో తక్కువ ధరలకు విక్రయించక తప్పడం లేదు. ప్రభుత్వం అరటిని నిల్వ చేసుకునే సౌకర్యాలు కల్పించి రైతులను ఆదుకోవాలి.

- డి.సత్యనారాయణ తీపర్రు, పెరవలి మండలం.

అరటి ధరలు ఊరట నిస్తున్నాయి...

ఐదు ఎకరాల్లో కర్పూర రకం అరటి సాగు చేస్తున్నాను. గత పది రోజులుగా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. టన్ను అరటి కనిష్టంగా టన్ను రూ.30,000 చొప్పున వ్యాపారులు తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరో నెల రోజుల పాటు ఈ ధరలు ఉంటాయని అంచనా. గత కొంతకాలంగా నష్టాల్లో ఉన్న రైతులకు కొంత ఊరట లభించినట్లే.

- ఎం.జానకి, తీపర్రు, పెరవలి మండలం.



సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

గ్యాస్ ధర పెంపుపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై అత్యంత దారుణంగా భారాలు వేస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్ సుంకాల పేరుతో గ్యాస్‌పై నేరుగా రూ.50 పెంచారని తెలిపారు. దీనివల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పరోక్షంగా ప్రజలపై మరింత భారం పడుతుందన్నారు. ఒకప్రక్క దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మతాల చిచ్చు పెడుతుందని అన్నారు తక్షణమే పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కన్వీనర్ వీరబాబు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చే ముందు వచ్చేది అచ్చే దిన్ అన్న విషయాన్ని ప్రస్తావించారు. ఎవరికి అచ్చేదిన్ అని ఆనాడే సిపిఎం ప్రశ్నించిందన్నారు. సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకు సంపద పెంచడమే బిజెపి, మోడీ విధానాలని విమర్శించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా మనదేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు ఈ విషయాలు గమనించకుండా మతాన్ని, విశ్వాసాలను చర్చ పెట్టి ప్రజలను విభజించి కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతిస్తున్న చంద్రబాబు, పవన్ ప్రజల పక్షాన చిత్తశుద్ధిగా నిలబడాలన్నారు. గాడిమొగ గ్యాస్‌ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులకు రూ.100కే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలక వెంకట రమణ, నాయకులు చంద్రమళ్ళ పద్మ, మేడశెట్టి వెంకటరమణ, జి.భూలక్ష్మి, టి.రాణి, ఆర్.తలుపులమ్మ, కె.పోలితల్లి, కె.సత్తిబాబు, వి.కుమారస్వామి, టి.వీరబాబు, రాజు, నరేంద్ర, శివ పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

'వక్ఫ్ చట్ట సవరణ - మైనారిటీలపై మరోదాడి' అనే అంశంపై గురువారం సాయంత్రం 5 గంటలకు సుందరయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణ పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. భారత రాజ్యాంగంలోనికొన్ని అధికరణలను ఉల్లంఘిస్తున్నట్లు అనేక మంది మేధావులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారని, ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ రాజకీయ పక్షాలు, వివిధ కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా ప్రజాసంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజాస్వామికవాదులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనాలని వారు కోరారు.


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

స్మార్ట్ మీటర్లు వద్దు

ప్రజాశక్తి - కాజులూరు

మా ఇంటికి స్మార్ట్ మీటరు వద్దు పాత మీటర్లే ముద్దు అంటూ ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కోలంక పంట కాలువ వద్ద విద్యుత్ వినియోగదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలతో వినియోగదారులపై భారాలు వేసిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఇకపై గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి కాంట్రాక్టు సంస్థలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఆదానీ కంపెనీతో ఒప్పందం చేసుకున్నదని, ఆ ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధపడుతుందన్నారు అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన చంద్రబాబు నేడు ఆ ఒప్పందాన్ని అమలు చేయడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్ బిగించడంతో సెల్ ఫోన్ మాదిరిగా ముందే రీఛార్జ్ చేయించాల్సిన పరిస్థితి దాపురిస్తుందన్నారు. అర్ధరాత్రి రీఛార్జ్ అయిపోతే తెల్లవారే వరకు విద్యుత్ సౌకర్యం లేకుండా పోతుందన్నారు. కావున స్మార్ట్ మీటర్లు ఇళ్లకు వేస్తే ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాజు, బోండా దొరబాబు, కంబాల తాతాజీ, బొండా వెంకన్నబాబు, బూరెల సూరిబాబు, బూరెల పల్లపరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో కార్యకర్తల అసహనం

- లోకేష్ నాయకత్వం అవసరమన్నా వర్మ
- జనసేన ఎంఎల్‌ఎలపై అసంతృప్తులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నికల్లో ఎంతో కష్టపడి పనిచేసినప్పటికీ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదంటూ పలువురు టిడిపి కార్యకర్తలు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రధానంగా జనసేన ఎంఎల్‌ఎలు ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో టిడిపి కార్యకర్తలకు విలువ లేకుండా పోయిందని వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ రోజుకి 18 గంటలు పని చేస్తున్నారని, కానీ కార్యకర్తలు 24 గంటలు పనిచేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో కార్యకర్తలకు గుర్తింపు లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేయడం జరిగిందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు కార్యకర్తలకు జవాబుదారీగా ఉండేలా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు కూడా అసంతృప్తిని వ్యక్తం చేశారు. టిడిపికి బలం కార్యకర్తలని, వారిని మరిచిపోతే పార్టీకి మరోసారి ఇబ్బందులు తప్పవని, తక్షణమే ప్రక్షాళన చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. కార్యకర్తలను గుర్తించకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. పార్టీలో నాయకులకు ప్రాధాన్యత లేకపోవడం వలన కార్యకర్తల సమస్యలను పరిష్కరించలేకపోతున్నారన్నారు.

తెలుగుదేశం పార్టీకి లోకేష్ నాయకత్వం అవసరమని, ఆయన నిర్వహించిన యువగళం పాదయాత్ర వల్లనే పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ దర్బార్లో టిడిపి కార్యకర్తలు, ప్రజలు వినతులు అందించారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఎంఎల్‌సి పి.రాజశేఖరం, ఎంఎల్‌ఎలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. టిడిపికి నారా లోకేష్ నాయకత్వం ఎంతో అవసరం ఉందని తెలిపారు. పార్టీకి 2047 ప్రణాళిక కావాలన్నారు. పార్టీ రథ సారధిగా లోకేష్‌ను నియమించేలా చంద్రబాబు నిర్ణయం తీసుకోవాలని కోరారు. పార్టీకి భవిష్యత్తు ప్రణాళికతో పాటు భవిష్యత్తు తరాలకు నాయకుడు అవసరమని వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన నారా లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఆ తర్వాత చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు.



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ వర్మ

బాక్సింగ్ పోటీలకు పలువురి ఎంపిక

ప్రజాశక్తి -పిఠాపురం


క్రీడాకారులతో కోచ్‌లు, ప్రతినిధులు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాక్సింగ్ యూత్ మెన్ అండ్ ఉమెన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి 25 మంది హాజరవ్వగా మహిళా విభాగంలో 8 మంది, పురుషులు విభాగంలో ఇద్దరు మొత్తం 10 మంది ఎంపికయ్యారు. ఎంపికైన బాక్సర్స్ ఈనెల 12, 13 తేదీలలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కృపారావు, కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రాయుడు శ్రీనివాసరావు, అల్లవరపు నగేష్, జిల్లా రగ్బి అసోసియేషన్ సభ్యులు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని కోలంకలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బాబా యువజన సంఘం ప్రోగ్రాం ఆఫీసర్ గుంటూరు మాణిక్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొని వైద్య సేవలందిస్తారన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందని, ఈ అవకాశాన్ని కోలంక పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రజా సంఘాల భవనంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల విస్తృత సమావేశం దుప్పి అదృష్టదీపుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు, మేట్లు హాజరై ఉపాధి పనులు ఇంకా ప్రారంభించలేదని, గతంలో చేసినటువంటి పనులకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. గతంలో ఇచ్చినటువంటి మెడికల్ కిట్లు, పరికరాలు, టెంట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఏ మండలంలోను ఇప్పటివరకు ఉపాధి పనులు ముమ్మరంగా ప్రారంభించకపోవడం చాలా విచారకరమని అన్నారు. ప్రభుత్వం చెబుతున్న రూ.300 వేతనం ఎక్కడ రావడం లేదని అన్నారు. బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని మెడికల్ కిట్లు ఇవ్వాలని, మేట్లకు పారితోషం ఇచ్చి, ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు, సంఘం నాయకులు నేరేడుమిల్లి త్రిమూర్తులు, బీర వెంకటేశ్వరరావు, గోడి భాస్కరరావు, దుప్పి వాసుదేవరావు, గొలుసు వెంకటరమణ, రామవరపు ఉప్పయ్య, చెక్క కనకదుర్గ, పెనుపోతు భాగ్యలక్ష్మి, మచ్చ శివాజీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి


సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో అంతర్ విశ్వవిద్యాలయం పరిధిలో కబడ్డీ టోర్నమెంట్ బుధవారం ప్రారంభం అయింది. ఈ పోటీలను యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో పోటీలను ఆసక్తి కరంగా విజయవంతగా పూర్తి చేయాలని కోరారు. విద్యార్థులు ప్రతీ ఒక్కరూ ఆటల్లో పాల్గొనుటకు ఆసక్తి చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సిలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

హైస్కూల్లో ప్రవేశాలకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలపై ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను బుధవారం ప్రారంభించారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ తల్లికి వందనం, ఉచిత యూనిఫాం, ఉచిత పుస్తకాలు, ఎన్‌ఎంఎంఎస్, ట్రిబుల్ ఐటీ వంటి అదనపు సౌకర్యాలను కరపత్రాలు ద్వారా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రాజు, కె.అరుణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆధార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో 0-6 సంవత్సరాల మధ్య ఉన్న చిన్నారులకు వెంటనే ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించాలని, ఆధార్ నంబర్ లేని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టిక ఆహార సేవలు నిలిపివేయడం జరుగుతుందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి, సిడిపిఒలు, పోస్టల్, సిఎస్‌సి, ఆధార్, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారులతో 6 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆధార్ రిజిస్ట్రేషన్, ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహణ ఇతర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారం పొందుతున్న 0-6 చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఆధార్ నెంబరు లేని చిన్నారులకు రానున్న మే నెల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహార సేవలను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ రిజిస్ట్రేషన్ కొరకు ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. సిడిపిఒలు, పోస్టల్, ఆధార్ రిజిస్ట్రేషన్ కోఆర్డినేటర్స్ సమన్వయంతో పనిచేసి ఈ ఆధార్ క్యాంపు నిర్వహణ సజావుగా సాగేలా చూడాలన్నారు. కొత్త ఆధార్ రిజిస్ట్రేషన్ కొరకు పోస్టల్ ఆధార్ సెంటర్లు, సిఎస్‌సి సెంటర్లలోను, ఆధార్ నందు మార్పులు, చేర్పులను సబ్ పోస్ట్ ఆఫీస్, సచివాలయాల్లోను చేపట్టాలన్నారు. వివిధ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ఇతర మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి, వివిధ ప్రాంతాల సిడిపిఒలు, పోస్టల్ ఆధార్ మేనేజర్ రాజుకుమార్, సిఎస్‌ఇ ఆధార్ మేనేజర్ ఆదిత్య, జిఎస్‌డబ్ల్యూఎస్ ఆధార్ కో ఆర్డినేటర్ శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ వర్మ

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా మండలంలోని మల్లంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసే నివాళులర్పించి పోటీలను ప్రారంభించారు. అనంతరం టీం సభ్యులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అంబేద్కర్ జయంతిని పరిష్కరించుకొని వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో అంబేద్కర్ ఉత్సవాలను వాడ వాడల ఘనంగా నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాట్ల సూరిబాబు, ఎద్దు సుబ్రమణ్యం, అంగుళూరు నూకరాజు, దుర్గాడ సత్తిబాబు, కల్దరి లచ్చబాబు, కాల్దర్ రాంబాబు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వలస కూలీలకు ఆహార పదార్థాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ఆధ్వర్యంలో బుధవారం ఎడిబి రోడ్డు పరిసరాలలో నివసిస్తున్న వలస కూలీలకు ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ద్రాక్షారామంకు చెందిన విస్సప్రగడ రక్షిత్ జన్మదినం సందర్భంగా వారి తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు బాల హైమావతి ఆర్థిక సాయంతో ఇల్లు లేని వలస కూలీల కు ఆహార పదార్థాలు పంపిణీ చేశామన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అమృత, నమ్రత, మణికంఠ, బోడా చరణ్ పాల్గొన్నారు.

వీధి కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ పరిధిలో వీధి కుక్కలకు సంతానోత్పత్తి కలగకుండా నగర పంచాయతీ కమిషనర్ ఎన్.కనకారావు ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల్ని సంతోనోత్పత్తి కలగకుండా శస్త్రచికిత్సలు చేసేందుకు పట్టుకుని కాకినాడలోని సొసైటీ ఫర్ నేచర్ అండ్ యానిమల్ ప్రొటెక్షన్ ఎబిసి సెంటర్‌కు 20 వీధి కుక్కలను తరలించారు. ఈ కార్యక్రమాన్ని కె.రఘుప్రసాద్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె.షారుక్, వై.సతీష్ పరివేక్షించారు.

నైపుణ్యతను వెలికితీసేందుకే 'తలాష్'

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యతను వెలికితీసేందుకు తలాష్-2025 వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఒఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రబాల్ సేన్ గుప్త అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్, కామర్స్, మేనేజ్‌మెంట్ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో బుధవారం తలాష్-2025 పేరుతో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎస్.ప్రశాంతిశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ ఫెస్ట్‌లో ఆయన మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు దోహదం చేస్తాయని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఒఎన్‌జిసి ప్రబాల్‌సేన్ గుప్త

పాల్గొని విసి ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విద్యార్థి దశలో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడానికి దోహదం చేస్తాయన్నారు. సమాజంలో వివిధ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. నన్నయ క్యాంపస్‌కు ఒఎన్‌జిసి సంస్థ అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి జిఎం(హెచ్ఆర్) కె.సునీల్‌కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ డి.ఉదయరత్న, విభాగ అధ్యాపకులు డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ మధుకుమార్, మణికంఠేశ్వర్‌రెడ్డి, మనోజ్ దేవ్, డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమా రజిత సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదాం...

ప్రజాశక్తి - కరప

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఐక్యంగా ముందుకు సాగుదామని ఎంఎల్‌ఎ పంతం నానాజీ అన్నారు. బుధవారం ఆయన మండల అభివృద్ధిపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తొలుత స్థానికంగా ఉన్న గురుకుల పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో నూతనంగా నిర్మించిన భోజనశాల షెడ్డును ఆయన ప్రారంభించారు. భవిత కేంద్రం విద్యార్థులకు అలెన్కో సంస్థ సౌజన్యంతో ఉపకరణాలు పంపిణీ చేశారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ నియోజకవర్గంలో రూ.28.78 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సిఎస్ఆర్ నిధులతో మండలంలోని 193 కరెంటు పోల్స్‌కు వెచ్చించడం జరిగిందన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి 82 ప్రతిపాదనలు పంపగా ఒక్కొక్కరికి లక్ష చొప్పున 58 లక్షలు లబ్ధిదారులకు అందించడం జరిగిందని, మరో 32 లక్షల నిధులు వచ్చి ఉన్నాయని వివరించారు. 481 మందికి మహిళలకు కుట్టుమిషన్లు శిక్షణ ఇప్పించి ఉచితంగా మిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదుపాయాలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి, ఎంపిడిఒ ఎం.అనుపమ, తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ, జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, బండారు మురళి, ముద్రగడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.


వండిన వంటలను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని ఎస్ చిన్నజగ్గంపేటలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో ప్రజాసంఘాల నాయకులు పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సింహాచలం మాట్లాడారు. ప్రజలకు ఉపాధి చట్టంలో పనులు కల్పించాలని, 6 వారాల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని, గ్రామంలో నెలకున్న శ్మశాన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అమలు చేస్తున్న దళితులకు 200 యూనిట్ల లోపు విద్యుత్ రాయితీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1235 జిఒ ప్రకారం దళితులకు రెండు ఎకరాల శ్మశాన స్థలం కొనుగోలు చేసి ఇవ్వాలని అన్నారు. పూరి గుడిసెల్లో ఉంటున్న దళితులకు ప్రభుత్వం అందజేస్తున్న విద్యుత్ సబ్సిడీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికులకు కూలి రూ.7 పెంచి గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బరాల చక్రరావు, చుక్కల సూరిబాబు, బండి శ్రీనివాసరావు, భూర్తి పవన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.


సమస్యలను తెలుసుకుంటున్న ప్రజా సంగాల నాయకులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ట్రినిటీ లూథరన్ చర్చ్ ఆవరణలో సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు అన్నపూర్ణ తల్లి పిల్ల హాస్పిటల్ డాక్టర్ పిఎన్.రాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మిత్రమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాస్, సిహెచ్.సతీష్ మాట్లాడుతూ సహృదయ మిత్రమండలి వ్యవస్థాపకుల్లో ఒకరైన టివిఎల్.నరసింహారావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు కంటి వైద్యురాలు అవని ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఆపరేషన్ అవసరమైన 55 మందిని గుర్తించి ఉచిత ఆపరేషన్ కి పంపించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రి బృందాన్ని లూథరన్ చర్చ్ పాస్టర్ కె.శ్యామ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ రిటైర్డ్ డిడి అప్పారావు, పిఠాపురం పెన్షన్స్ అసోసియేషన్ కార్యదర్శి సాల్మన్‌రాజు, డాక్టర్ సూర్యనారాయణ, రిటైర్డ్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కేశవరావు, కామరాజు, సత్యనారాయణ, పావని, వీరభద్రరావు, పి.వేణు పాల్గున్నారు.


కళ్ల పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

ప్రజాశక్తి - కోటనందూరు

ప్రజలకు జవాబుదారీగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండాలని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ యనమల దివ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 11 నెలల కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ సరిహద్దు వివాదాలు, పారిశుధ్యం, తాగునీరు వంటి సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి తదుపరి నివేదిక అందజేయాలని ఆయా శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. ప్రభుత్వం సబ్సిడీలో మంజూరు చేసిన వ్యవసాయ యంత్రాలను రైతులకు అందజేశారు. 499 డ్వాక్రా సంఘాలకు రూ.48 కోట్ల రుణాల చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు గాడి రాజబాబు, మాజీ ఎంపిపి దంతులూరి చిరంజీవిరాజు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర సత్యనారాయణ, లోవ ఛైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వెలగా వెంకట కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ దివ్య

సాధారణ ప్రసవాలే మేలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సాధారణ ప్రసవాలు తల్లి, బిడ్డకు ఎంతో మేలు జరుగుతాయని స్థానిక సిహెచ్‌సి గైనకాలజిస్ట్ సౌజన్య అన్నారు. బుధవారం స్థానిక సిహెచ్‌సిలో సూపరింటెండెంట్ స్నేహలతతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. సాధారణంగా నెలలు నిండిన వెంటనే సాధారణ ప్రసవం జరగకపోవచ్చని, అందువల్ల గర్భిణి, ఆమె కుటుంబ సభ్యులు కంగారు పడాల్సిన పనిలేదని అన్నారు.. శస్త్ర చికిత్స ద్వారా జరిగే ప్రసవాలు వల్ల తల్లి, బిడ్డలకు హాని జరుగుతుందని, తరచూ ఇద్దరు అనారోగ్యల పాలవుతారని తెలిపారు. రెండో కానుపు సమయంలో గర్భసంచి దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల సులువుగా ప్రసవం అయ్యేంతవరకు తల్లులు కంగారు పడకూడదని ఆమె వివరించారు. సూపరింటెండెంట్ స్నేహలత మాట్లాడుతూ ప్రతి స్త్రీ గర్భం దాల్చక ముందు నుంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న సౌజన్య

ఏప్రిల్ 14న మద్యం విక్రయాలు నిషేధించాలి

ప్రజాశక్తి - కాకినాడ

గాంధీజీ జయంతి, రిపబ్లిక్ డే రోజుల్లో మాదిరిగానే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి రోజున దేశమంతా మద్యం విక్రయాలను నిషేధించాలని మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం కలెక్టర్ షాన్‌మోహన్ సగిలిని కమిటీ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు వేమగిరి తలుపులయ్య మాట్లాడుతూ మద్యం, మాదక ద్రవ్యాల వలన అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. అనేకమంది తీవ్రమైన అనారోగ్యాలకు గురై చనిపోతున్నారన్నారు. తద్వారా ఆర్థికంగా ఆయా కుటుంబాలు ఇబ్బందులకు గురై బతకలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకుండా ప్రజల ఆరోగ్యాలను, వారి ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విశాల్, విజయలక్ష్మి దేవి, ప్రేమలత పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ప్రతిభ పాఠశాలలోకిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుధారాణి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపు దిద్దుకుంటుందన్నారు. పిల్లల సర్వతోముఖాభివృద్ధి ధ్యేయంగా విలువలతోకూడిన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పలువురి విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలను ఆహ్లాదకర వాతావరణంలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్న పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.సునీత , వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరీ, పెద్దాపురం ప్రతిభ బ్రాంచ్ ప్రిన్సిపల్ టి.అరుణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్‌డి.భవాని, పాల్గొన్నారు.


విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి బుధవారం వచ్చిన గర్భిణులకు మన పెద్దాపురం ఫేస్‌బుక్ మాతృత్వం కార్యక్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ఎస్ఐ.మౌనిక ఆర్థిక సాయంతో గర్భిణులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక, స్థానికులు జయశ్రీ, నాగలక్ష్మి, బల్ల లక్ష్మి, సత్య రాణి, ఆత్మూరి లక్ష్మి, రత్నం, భుజంగరావు, సరన్, వడ్డి సత్యనారాయణ, దేవత రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో బుధవారం వైఆర్ఎల్ ఐఐటి కాన్సెప్ట్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో భౌతిక శాస్త్రంలో విద్యుత్ ప్రవాహం వల్ల కలిగే రసాయన ఫలితం పాఠ్యాంశంలోని వివిధ ప్రయోగాలు చేయించారు


ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

13న దాట్లకు అభినందన సభ

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 13న ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజుకు అభినందన సభను నిర్వహిస్తున్నట్లు కవిసంధ్య సంపాదకులు డాక్టర్ శిఖామణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి ప్రభుత్వం నుంచి కళారత్న అవార్డు అందుకున్న సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో అభినందన సభను ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి, డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డాక్టర్ వరుగుభాస్కర్ రెడ్డి, ఈలప్రోలు విష్ణువర్ధనరావు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, పొనుగుమట్ల విష్ణుమూర్తి, మాకినీడి సూర్యభాస్కర్ పాల్గొంటారని తెలిపారు.

నేరాలు ఘోరాలు


సమావేశంలో మాట్లాడుతున్నో నరసింహ కిషోర్

270 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-రాజానగరం

ఏజెన్సీ ప్రాంతం నుండి 270 కేజీలు గంజాయి తరలిస్తుండగా బొమ్మూరు పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.13 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. దీనిపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి డి.నరసింహ కిషోర్ బుధవారం వివరాలు వెల్లడించారు. గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో రాజానగరం మండలం దివాన్ చెరువు జాతీయ రహదారి జీరో పాయింట్ సమీపంలో తనిఖీలు చేపట్టగా 270 కేజీల గంజాయి ఒక కంటైనర్ లారీలో ఉన్నట్లు గుర్తించారు. గంజాయి, లారీ సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేసి విచారించారు. నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతం నుండి హర్యానాకు గంజాయి రవాణా చేస్తున్నారని చెప్పారు. గంజాయి సుమారు రూ.13 లక్షల 50 వేలు, కంటైనర్ లారీ రూ.30 లక్షలు ఉంటుందని చెప్పారు. బొమ్మూరు సిఐ పి.కాశీ విశ్వనాథం పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

3 టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని శృంగవరం గ్రామానికి చెందిన కళ్ల సత్తిబాబు అక్రమంగా నిల్వ చేసిన 3 టన్నుల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం రాత్రి సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ జిఆర్‌కెవి.ప్రసాద్ బుధవారం తెలిపారు.

దాడికి పాల్పడిన ముగ్గురి అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

దాడికి పాల్పడిన ముగ్గురిని సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏప్రిల్ 1న పెంకేవారి కాలనీ, పాత గైగోలుపాడు ప్రాంతంలోని వైన్ షాప్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ ఘటనకు కారకులైన పాలిక రమేష్, దాసరి రాజు, గంజా దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో నష్టం రావడంతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. రామన్నపాలెం గ్రామానికి చెందిన సూరిబాబు ఒక షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈజీమణి సంపాదించాలనే సంకల్పంతో సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడటం మొదలుపెట్టాడు. ఇటీవల తన. ఎకరం భూమిని అమ్మిన ఒక కోటి 50 లక్షలు సొమ్ము ఇంటిలో ఉంచి బెట్టింగ్ యాప్ ఆడటం మొదలు పెట్టాడు. బెట్టింగ్ యాప్‌లో అధిక సొమ్ముల కోసం ఆశించడం కారణంగా బెట్టింగ్ యాప్‌లో సొమ్ములు కోల్పోయిన వ్యక్తి పురుగులు మందు సేవించాడు. అతనిని కుటుంబీకులు కాకినాడ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తుంది. పురుగులు మందు సేవించిన వ్యక్తికి వివాహమై ఒక అమ్మాయి ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కొత్తలంక గ్రామానికి చెందిన ఒక మహిళ మంగళవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తలంక గ్రామానికి చెందిన పసుపులేటి కృష్ణవేణి (45) మంగళవారం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని, బంధువులు తెలిసిన వాళ్ళ ఇల్లు వద్ద వెతికిన ఆచూకీ లభ్యం కాలేదని ఆమె కుమారుడు వీర హరి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. మహిళకు భర్త ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌హెచ్ఒ జి.భైరవ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆమె ఆచూకీ తెలిస్తే ఈ నెంబర్లకు ఈ క్రింది సెల్ నంబర్లకు తెలియజేయాలని 919849918933, 9177547754 తెలిపారు.


పూజలు చేస్తున్న సిఐ శ్రీనివాసరావు

మరిడమ్మను దర్శించుకున్న సిఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారిని బుధవారం జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వేద పండితులు దేవస్థానం తరపున ఆలయ మర్యాదలతో దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వద్ద దేవస్థానం ఎసి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆశాధులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, పూజారి ఐవి.ప్రసాద్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైజ్ఞానిక మహాసభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి పంచాయతీ చిన బొడ్డు వెంకటాయపాలెంలోని అచల రుషి నిర్మలాశ్రమంలో బుధవారం వైజ్ఞానిక మహాసభ నిర్వహించారు. బొడ్డు కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన వైజ్ఞానిక మహాసభ లో పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

కాకినాడ జిల్లా సంక్షిప్త వార్తలు



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి గోపి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల మత్స్యశాఖ అధికారి జి.గోపి అన్నారు. బుధవారం పి.మల్లవరంలో సర్పంచ్ పంపన రామకృష్ణ అధ్యక్షతన ఆక్వా జోన్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా జోన్ పరిధిలో ఉన్న రైతులకు విద్యుత్ బిల్లు యూనిట్ ధర రూ.1.50 మాత్రమే ఉంటుందని, జోన్లో లేని రైతులకు రూ.3.50 నుంచి రూ.7.00 ల వరకు బిల్లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ పథకాలు రైతులకు వర్తిస్తాయని అన్నారు. ఇప్పటికే 40 శాతం సబ్సిడీపై రూ. 14 లక్షల యూనిట్‌తో బయోఫ్లాక్ పథకం అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్న జనార్ధనరావు, మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, మత్స్య శాఖ సిబ్బంది, ఆక్వా రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

సేంద్రియ వ్యవసాయ విధానంపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బుధవారం మండలంలోని ఉండూరు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిసి డిడిఎ ఎం.హరి, వ్యవసాయ అధికారులు పాల్గొని మాట్లాడారు. నేలపై అవగాహన కల్పించుకుని భూమి పోషణ చేపట్టి, భూమి నాణ్యతను మెరుగు పరుచుకోవాలన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఎరువులపై 50 శాతం రాయితీని ఇస్తుందన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ మాధవి, మండల ఎఒ ఇమ్మిడిశెట్టి సత్య, ఎడిఎ రత్నప్రశాంతి, మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, అడిషనల్ మేనేజర్ కిషోర్‌బాబు, ఎఒ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు

ప్రజాశక్తి - శంఖవరం

స్థానిక పిహెచ్‌సిలో గర్భిణులకు ఆరోగ్య పరిక్షలు నిర్వహించారు. బుధవారం పిహెచ్‌సి వైద్యులు ఆర్‌విఐ.సత్య నారాయణ ఆధ్వర్యంలో పిఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శెట్టిబత్తుల శ్రీరామ్ రాజీవ్‌కుమార్ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు పై అవగాహన కల్పించారు. ఈ నెల 22వ తేదీ వరకూ జరిగే పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణశ్రీ పౌష్ఠిక ఆహారం అలవాట్లుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టార్ లైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు తలపంటి అప్పారావు భోజనాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రవిశంకర్, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యనమలను సత్కరించిన ఎంపి

ప్రజాశక్తి - తుని

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడును ఎంపి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ సత్కరించారు. బుధవారం తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో యనమలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ యనమల రామకృష్ణుడు 42 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పుస్తక రూపంలో ఆవిష్కరించడం హర్షనీయమని అన్నారు. యనమల రాజకీయ అనుభవం యువ రాజకీయ నాయకులకు ఆదర్శంగా ఉంటుందని కొనియాడారు. అనంతరం యనమలను ఆయన సత్కరించారు.


యనమలను సత్కరిస్తున్న ఎంపి తంగెళ్ల

నేడు పుస్తక ఆవిష్కరణ

మాజీ మంత్రి, పొలిటి బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు 42 వసంతాల రాజకీయ ప్రస్తావన పుస్తక ఆవిష్కరణ గురువారం నేడు తుని పట్టణంలో జరుగుతుందని కూటమి నాయకులు యనమల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెఇపార. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, టిడిపి నాయకులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా వల్లభస్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి కల్యాణోత్సవం వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఎంపి తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. స్వామివారికి ఎంఎల్‌ఎ చినరాజప్ప పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ చార్యులు ఆధ్వర్యంలో దేవతామూర్తులను మండపానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చినరాజప్ప